క్లుప్తంగా

అమ్మవారికి బంగారు నేత్రాల బహూకరణ



దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు వుట్టి నాగశయనం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మేదరవీధిలోని శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి అమ్మవారికి రూ.1.55 లక్షల విలువ చేసే 26 గ్రాముల బంగారు నేత్రాలను బహూకరించారు. అంపావతిన రామయ్య, అచ్చమ్మల కుమారుడు నాగరాజు, కోడలు విజయలక్ష్మిలు వీటిని కానుకగా ఆదివారం సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వుట్టి నాగశయనంకు అందించగా, పూజా కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్, ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు రామచంద్రుడు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గురప్పస్వామి ఆలయంలో దుకాణాల వేలం

పోరుమామిళ్ల: మండలంలోని ప్రసిద్ధ దర్శనీయ క్షేత్రం శ్రీ మద్దిమాను గురప్పస్వామి ఆలయం వద్ద వివిధ వస్తువుల అమ్మకానికి, తలనీలాల సేకరణకు హక్కు పొందుటకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ కార్య నిర్వాహణాధికారి నరసయ్య తెలిపారు. తలనీలాలు సేకరించుకొను హక్కుకు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. టెంకాయలు విక్రయించేందుకు, అంగళ్లు ఏర్పాటు చేసుకునేందుకు, వంటపాత్రలు, షామియా బాడుగకు ఇచ్చేందుకు, కూల్‌డ్రింక్ షాపు నిర్వహించుకునేందుకు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. పాటదారులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.

వాసవి మాతను దర్శించుకున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్



అమ్మవారిశాలలో డైరెక్టర్ ఏవీఎస్ కుమార్‌స్వామిగుప్తా

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఆదివారం ఇడుపులపాయలోని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమార్‌స్వామిగుప్తా దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయనను అమ్మవారిశాల కమిటీ అధ్యక్షుడు బన్నూరు కృష్ణమూర్తి సన్మానించి అమ్మవారి ప్రసాదంను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీకి ఉచిత కోచింగ్



కరపత్రాలు విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో శిక్షణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు శిక్షణ ఉంటుందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేవీవీ పట్టణ కార్యదర్శి సునీత తెలిపారు. ఆసక్తి గలవారు ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9705333305 నంబరుకు సంప్రదించాలని కోరారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గోల్డెన్ పార్కులో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చన్నారు. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్తు బాట వేసుకోవాలన్నారు. యూనివర్సిటీ స్థాయిలో క్రీడాపోటీల్లో ప్రతిభ కనపరచిన, చదువులో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాడు నిర్మించారు.. నేడు వదిలేశారు..!

- వైఎస్సార్‌సీపీ హయాంలో డెయిరీ ఏర్పాటు
- వినియోగంలోకి తీసుకురాని కూటమి ప్రభుత్వం
- పాడి రైతులకు తీవ్ర నష్టం



నంగనూరుపల్లెలో నిరుపయోగంగా ఉన్న డెయిరీ

ప్రొద్దుటూరు: పాడి రైతుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డెయిరీ నిర్మించారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని నంగనూరుపల్లెలో 2024లో డెయిరీ నిర్మించారు. ఈ గ్రామానికి సంబంధించి ఎక్కువ సంఖ్యలో పాడి రైతులు ఉన్నారు. రోజూ సుమారు 500 నుంచి 1000 లీటర్ల వరకు గ్రామంలో పాల ఉత్పత్తి జరుగుతోంది. ఈ విషయాన్ని గమనించి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా మహిళా డెయిరీని ఏర్పాటు చేశారు. సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన భవనాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించారు. అయితే ఇంత వరకు డెయిరీకి సంబంధించిన పనిముట్లు మంజూరు కాకపోవడంతో భవనం నిరుపయోగంగా ఉంది.

ఎన్నో ఉపయోగాలు

డెయిరీ ప్రారంభమైతే పాడి రైతులకు ఎన్నో ఉపయోగాలు కలగనున్నాయి. పాడి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రావడంతోపాటు పాల నాణ్యతను క్షణ్ణంగా పరిశీలించే అవకాశం ఉంది. ప్రైవేటు వ్యాపారులు తమకు అనుకూలమైన రీతిలో పాలను సేకరిస్తున్నారు. మైదుకూరుకు చెందిన ఓ ప్రైవేటు డెయిరీ వారు గ్రామంలో ప్రత్యేకంగా పాలసేకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి డెయిరీని ప్రారంభిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది.

పాడి రైతులకు మేలు



గత ప్రభుత్వంలో పాడి రైతుల కోసం డెయిరీ ఏర్పాటు చేశారు. పరికరాలు మాత్రం సరఫరా కాలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని డెయిరీని ప్రారంభిస్తే మాకు ఎంతో మేలు జరుగుతుంది. రోజూ అనేక మంది వ్యాపారులు గ్రామంలో పాలు సేకరించి ప్రొద్దుటూరుకు తీసుకెళుతున్నారు. డెయిరీ ప్రారంభిస్తే ఇక్కడే రైతులు పాలను అమ్ముకోవచ్చు.

– శావలి వెంకటరమణ, నంగనూరుపల్లె, ప్రొద్దుటూరు మండలం

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సునీల్‌కుమార్, శ్రీనివాసులరెడ్డితో రెడ్యం

ఖాజీపేట: టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను, నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ ఐటీ బెంగళూరు ఐటీవింగ్ అహర్నిశలు కృషి చేయాలని ఆ సంస్థ కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్ గౌడ్‌కు వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి దిశానిర్దేశం చేశారు. దుంపలగట్టులోని రెడ్యం స్వగృహంలో ఆదివారం రెడ్యంను వైఎస్సార్‌సీపీ బెంగళూరు ఐటీ వింగ్ సునీల్‌కుమార్ గౌడ్ కలిశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించిన మహానేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారన్నారు. దీనికి గౌరవ సూచికంగా కడప జిల్లాను వైఎస్సార్ జిల్లాగా నాటి ప్రభుత్వాలు మార్చితే దానిని రాజకీయం చేస్తూ తిరిగి కడప జిల్లాగా మార్చాలని మాట్లాడటం సరైంది కాదన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్టీఆర్ పుట్టిన గడ్డ కృష్ణా జిల్లాను ఎన్టీఆర్ జిల్లాగా మార్చి తన పెద్ద మనసును చాటుకున్నారని గుర్తు చేశారు. ఏది ఏమైనా వైఎస్సార్ జిల్లా పేరును అలాగే కొనసాగించాల్సిందేనని లేకుంటే చరిత్ర హీనులుగా మారుతారని రెడ్యం తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో సోమాపురం సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లుకు అభినందనల వెల్లువ



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న పోరెడ్డి నరసింహారెడ్డి, నాయకులు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రాచమల్లును కలిసి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజాంరెడ్డి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, సోములవారిపల్లె పంచాయతీ ఒకటో వార్డు ఇన్‌చార్జి, ఎంపీటీసీ బాల గుర్రమ్మ గోటూరు వెంకటేష్, సోమాపురం గ్రామ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, మడూరు వినయ్‌కుమార్‌రెడ్డి, సునీల్‌కుమార్, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తదితరులు రాచమల్లుకు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి



మల్లయ్య ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బి.కోడూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని పాయలకుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, బూత్ కన్వీనర్ మల్లయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ప్రస్తుతం చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోడూరుచెన్నమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యోగానందరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: పట్టణంలోని కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన డాక్టర్ షెనాయ్ కూతురు నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దంపతులు, మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కల్లూరి రాజేశ్వరి, రమణారెడ్డి, గుబ్బా చంద్రశేఖర్ పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.

రాజోలి ఆనకట్టకు జలకళ



వెల్లాల పాత వంతెనపై వర్షం నీరు

రాజుపాళెం: కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. శనివారం రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 9100 క్యూసెక్కులు నీరు పోతుండగా ఆదివారం 23348 క్యూసెక్కులు, కేసీ ప్రధాన కాలువకు 730, కేసీ చాపాడు కాలువకు 146 క్యూసెక్కులు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాజోలి ఆనకట్ట వద్ద జళకళగా సంతరించుకుంది.

వెల్లాల పాతవంతెనపై రాకపోకలు బంద్

పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీటితో మండలంలోని వెల్లాల పాత వంతెనపై ఆదివారం నుంచి రాకపోకలు నిలిపివేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో కురిసిన వర్షం నీరంతా మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు భారీగా వస్తోంది. దీంతో పాత వంతెనపై నాలుగైదు అడుగుల మేర నీరు ప్రవహించడంతో ఏ వాహనాలు, పాదాచారులు పోకుండా రెండు వైపులా వీఆర్ఏలు ముళ్లకంపను అడ్డంగా వేసి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఈ దారిలో వెళ్లే వాహనాలన్నీ బైపాస్ రహదారి మీదుగా హైలెవెల్ వంతెనపై వెళ్లాలని సూచించారు.

పోరుమామిళ్ల చెరువు తూములు మరమ్మతు చేయాలి



తూమును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల: శిథిలావస్థకు చేరిన పోరుమామిళ్ల చెరువు తూములు మరమ్మతు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ ఇరిగేషన్ అధికారులను కోరారు. ఆదివారం సీపీఐ మండల నాయకులు చెరువు కట్టను, తూములను పరిశీలించారు. సుదీర్ఘ కాలంగా తూముల పర్యవేక్షణ లేకపోవడంతో లీకేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆయకట్టుదారులకు సక్రమంగా నీరు అందడం లేదని తెలిపారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కేశవ, చెన్నయ్య, సఫా పాల్గొన్నారు.

‘అనుమతి లేకుండా ఆస్పత్రి నిర్వహణ’

ప్రొద్దుటూరు: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కుక్కల ఆస్పత్రిని నిర్వహిస్తున్న తెల్లాకుల మనోహర్‌పై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కల ఆస్పత్రి అని బోర్డు వేసుకున్న ఆయన కుక్కలతోపాటు మూగజీవాలకు వైద్యం చేస్తున్నారన్నారు. మనోహర్‌తోపాటు ఆయన సతీమణి కూడా ప్రత్యేకంగా ఎలాంటి అర్హత లేకున్నా ప్రమాదకర మందులు అమ్మడంతోపాటు ఇంజెక్షన్లు వేస్తున్నారని తెలిపారు. ఇటీవల దళిత మహిళ రాజేశ్వరి తన కుక్కను తీసుకొని వారి వద్దకు వెళ్లిందన్నారు. తన కుక్క మరణించడంతో ఇదేమని ప్రశ్నించిన ఆమెపై తెల్లాకుల మనోహర్ దాడి చేశారని, ఇందుకు సంబంధించి ఆమెపై కేసు నమోదు కావడం రిమాండ్‌కు వెళ్లడం జరిగిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రిని నిర్వహిస్తున్నారని డీఎస్పీకి స్వయంగా వెటర్నరీ ఏడీ ధనుంజయరెడ్డి లేఖ రాశారని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం ఆస్పత్రి నిర్వహణపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

వృక్షాల సంరక్షణ అందరి బాధ్యత

బద్వేలు అర్బన్: ప్రతిఒక్కరూ వృక్షాలను సంరక్షణను బాధ్యతగా భావించాలని బద్వేలు పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నానబాల వెంకటేశ్వర్లు, బి.గురుమూర్తిలు పేర్కొన్నారు. ఆదివారం వారి కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో వాతావరణ కాలుష్యం అధికమవుతున్న నేపథ్యంలో చెట్లను నరికివేయకుండా కాపాడాలని, ఇందుకోసం మున్సిపల్ అధికారులు, అటవీ అధికారులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పట్టణాభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు హనుమంతరావు, కొండపల్లి సుబ్బారావు, సతీష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నివాళి



బండి విజయభాస్కర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్ యాదవ్ ఆదివారం సందర్శించి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పరామర్శించి ఓదార్చారు.

పోరాట యోధుడు వడ్డెఓబన్న



వడ్డెఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్: స్వాతంత్ర పోరాట సమయంలో ఆంగ్లేయులతో వీరోచిత పోరాటం చేసిన యోధుడు వడ్డెఓబన్న అని వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు రమణ పేర్కొన్నారు. వడ్డెఓబన్న వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేనాధిపతిగా వడ్డెఓబన్న వీరోచిత పోరాటాలు చేశారని కొనియాడారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు గంగయ్య, వెంకటేష్, రవిచంద్ర, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాజుపాళెం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వైద్యులు పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరులో మదనగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామానికి చెందిన బయపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు అక్షిత్ సాయి, పవన్‌కుమార్‌రెడ్డి, ఉదయ్ కిరణ్ రాజ, నాగ రవీంద్ర వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

లోకరక్షకీ ... పాహిమాం



ప్రొద్దుటూరు కల్చరల్ : ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి



బ్రహ్మంగారిమఠం : శ్రీ ఈశ్వరీదేవి మఠంలో అన్నపూర్ణాదేవిగా..



కలసపాడులో అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



కాశినాయన : నరసాపురంలో భవానిదేవి అలంకారం



పోరుమామిళ్ల: శ్రీకృష్ణావతార అలంకారంలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

బద్వేలు అర్బన్: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని బద్వేలు పట్టణంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నాల్గవ రోజైన ఆదివారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే మహాలక్ష్మీదేవి ఆలయంలో విద్యాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వగా వీరభద్రస్వామి ఆలయంలో జగన్మోహినీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. కోదండరామస్వామి ఆలయంలో వామనావతారములో స్వామివారు దర్శనమిచ్చారు.

భవానిదేవి అలంకారంలో అమ్మవారు

కాశినాయన: మండల కేంద్రమైన నరసాపురంలో దసరా పండుగను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారు భవానిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయకర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు

కలసపాడు: స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్, కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఎం.నాగరాజ, జె.నారాయణ, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణావతార అలంకారంలో వేంకటేశ్వరస్వామి

పోరుమామిళ్ల: శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీకృష్ణావతార అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు చాటకొండు వెంకట సుబ్రమణ్యం, కార్యదర్శి జనార్దన్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

మైదుకూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మైదుకూరులోని శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో, భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం: రాజుపాళెంలోని కొత్తకొట్టాల అంకాళమ్మ నగర్ ఆలయంలో అంకాళమ్మ.. అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవదర్గ ముఖ విలాస ప్రతిష్ట స్థాపన కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు.

ధనలక్ష్మీదేవిగా వాసవి మాత

దువ్వూరు: స్థానిక శ్రీమరకత వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గజలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

ఖాజీపేట: స్థానిక ఆర్యవైశ్య అమ్మవారి శాలలో గజలక్ష్మిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిశాలలో వాసవీ మాతాదేవి అమ్మవారు బంగారు ఆభరణాలతో ఉన్న అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.



బద్వేలు అర్బన్ : మహాలక్ష్మీదేవి ఆలయంలో విద్యాలక్ష్మీదేవి అలంకారం



మైదుకూరు భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రీమహాలక్ష్మీదేవి



రాజుపాళెం: అన్నపూర్ణాదేవి అలంకారంలో అంకాళమ్మ



దువ్వూరులో అమ్మవారిశాలలో ధనలక్ష్మీదేవి



ఖాజీపేట: బంగారు ఆభరణాలతో దర్శనమిస్తున్న వాసవీమాత



ప్రొద్దుటూరు కల్చరల్ : సూపర్‌బజార్ రోడ్డులో శారదాదేవి

నిరాధార ఆరోపణలు తగదు

ప్రొద్దుటూరు కల్చరల్: కొత్తపల్లె పంచాయతీలోని సాయిశ్రీనగర్, సాయికృపానగర్, సాయికృపా ఎన్‌క్లేవ్‌లపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని ఆ వెంచర్ల భాగస్వామి వేముల శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 సంవత్సరాల క్రితమే ఆ వెంచర్‌లను వేయగా పంచాయతీ అధికారులు అనుమతులు కూడా ఇచ్చారని పేర్కొన్నారు. ల్యాండ్ కన్వర్‌జేషన్ కోసం ప్రభుత్వానికి రూ.8 లక్షలు చెల్లించడం జరిగిందన్నారు. వెంచర్ భాగస్వామిగా ఉన్న ఓ వ్యక్తిపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలా చేస్తున్న వారు కూడా ప్లాట్లు కొని అధిక రేట్లకు విక్రయించారని తెలిపారు. ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి ఇటీవల పంచాయతీ అధికారులు అనుమతులు ఇచ్చారన్నారు. ప్లాట్ల కొనుగోలు దారులు రత్నాకర్, ప్రసాదరెడ్డి, వీరారెడ్డి, చంద్రారెడ్డి, మల్లారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.